క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: కృష్ణభక్తితో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని హరేకృష్ణ మూమెంట్ ప్రతినిధి డాక్టర్ వినోద్ ప్రభుజీ అన్నారు. పట్టణంలోని రాచన్నపేట, భవానీ మందిరం ప్రాంతంలో ఆదివారం 152వ హరేకృష్ణ నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. మనిషి తన నిజ జీవితంలో చేసిన పాప పరిహారానికి హరేకృష్ణ అనే షోడాశోపద మంత్రమే మూలమని చెబుతూ భగవద్ సన్నిధికి ఇదే ప్రధాన మార్గమన్నారు. అంతకు ముందు పురుషులు, మహిళలు, చిన్నారులు శ్రీ కృష్ణుడి కీర్తనలు పాడుతూ రాచన్నపేట్ ప్రధాన వీధుల్లో శోభా యాత్ర నిర్వహించారు. అంగరంగ వైభవంగా సాగిన సంకీర్తనలో వీధి ప్రజలు పువ్వులను వెదజల్లుతూ తమ భక్తి ప్రపత్తులను తెలియజేశారు.

మన్ కీ బాత్‌తో ప్రజలకు సందేశం



మన్‌కీ బాత్ వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

జహీరాబాద్ టౌన్: ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్‌ను ఆదివారం బీజేపీ నాయకులు వీక్షించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ నాయకులు ప్రధాని సందేశాన్ని శ్రద్ధగా విన్నారు. మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ పహల్గాం ఉగ్రదాడి గురించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, గొల్ల భాస్కర్, శ్రీనివాస్ గుప్తా, సుధీర్ బండారీ, పూల సంతోష్, నరేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

అమావాస్య పూజలు



రుద్రహోమంలో పాల్గొన్న చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఈఓ శశిధర్

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధి వీరన్నగూడెం గ్రామంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా రుద్రహోమం పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో వెంకట్ రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్ గుప్తా, పర్యవేక్షకులు సోమయ్య, అర్చకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసు దాడులు

ఎనిమిది మందిపై కేసు నమోదు



నిందితులను మీడియాకు చూపుతున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: పేకాట స్థావరంపై పోలీసుల దాడులు నిర్వహించి, ఎనిమిది మందిపై కేసు నమోదు చేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరులోని ఇంద్రేశం గ్రామ పరిధిలోని సూర్య వంశీ వెంచర్ బాలాజీనగర్‌లో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారంతో ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.51,800 నగదు, 08 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యేక పూజలు



మహాశివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

మునిపల్లి(అందోల్): అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని బుదేరా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో ఆయప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివలింగానికి పంచామృతాలతో మహాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నేడు భూభారతిపై అవగాహన

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భిక్షపతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సు జిల్లా అధికారుల సమక్షంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొనాలని సూచించారు.

'ఉపాధి'లో పశువులకు షెడ్లు

- పాడిరైతులకు ఆపన్నహస్తం
- నిర్మించుకునేవారికి యూనిట్లు మంజూరు



శేఖాపూర్ తండాలో నిర్మించిన పశువుల షెడ్డు

జహీరాబాద్ టౌన్: ఉపాధిహామీ పథకం కింద పాడి రైతులకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా పశువుల షెడ్లను నిర్మిస్తోంది. చాలా మంది ఈ పథకాన్ని చక్కగా వినియోగించుకుంటున్నారు. జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో పలువురు పాడి రైతులు షెడ్లు నిర్మించుకున్నారు. నిర్మాణానికి ముందుకు వచ్చిన వారికి అధికారులు యూనిట్ మంజూరు చేస్తున్నారు. ఉపాధిహామీ పథకం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎక్కువగా అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రభుత్వం పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు పశువుల పాకల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తుంది. ఇందిరా క్రాంతి పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి పొందేందుకు పాడి గేదెలను పంపిణీ చేశారు. పశువుల కోసం షెడ్లను నిర్మిస్తే మరింత ప్రోత్సహించినట్లువుతుందని షెడ్ల నిర్మాణానికి అనుమతులు ఇస్తుంది.

23 షెడ్ల నిర్మాణం

జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో ఇప్పటివరకు 23 పశువుల షెడ్లను నిర్మించారు. జహీరాబాద్ మండలంలోని అనేగుంటలో 3, అల్గోల్, డిడ్గి, శేఖాపూర్ తండా, కొత్తూర్(బి) గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున నిర్మించారు. మొగుడంపల్లి మండలంలో 15 పాకలను కట్టారు. మండలానికి ఎన్ని యూనిట్లయిన మంజూరు చేస్తారు. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగి కనీసం నాలుగు పశువులు ఉన్న వారికి షెడ్‌ను మంజూరు చేస్తారు. ఒక్కో షెడ్డుకు రూ. 80 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. రూ. 30 వేలు లేబర్‌కు ఖర్చు చేయగా, రూ. 50 వేలు మెటీరియల్‌కు ఇస్తున్నారు. 18 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పుతో పశువుల షెడ్డు నిర్మాణం చేపడుతారు. రైతులే స్వయంగా నిర్మించుకుంటే పనుల్లో నాణ్యత ఉంటుందని పలువురు చెబుతున్నారు.

ఆసక్తి ఉన్న వారిని గుర్తిస్తాం..



అర్హత.. అవసరం ఉన్న రైతులను గుర్తించి యూనిట్ మంజూరు చేస్తాం. షెడ్డు నిర్మించుకునేందుకు సొంత స్థలం ఉంటే చాలు, యూనిట్లను సద్వినియోగం చేసుకునేందుకు రైతులు ముందుకు రావాలి. ఆరుబయటకు బదులు పశువులను షెడ్లలో ఉంచడం వల్ల పాల దిగుబడిలో చాలా వ్యత్యాసం ఉంటుంది.

-అశోక్‌కుమార్, ఏపీఓ, జహీరాబాద్



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

అక్రమ నిర్మాణాలపై ఆందోళన

రామచంద్రాపురం,(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ బీహెచ్ఈఎల్ ఎంప్లాయిస్ సైబర్‌కాలనీలోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ..హెచ్ఎండీఏ ఆమోదించిన లేఅవుట్ ప్రకా రం వాణిజ్య సముదాయానికి కేటాయించిన స్థలా న్ని రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. హెచ్ఎండీఏ ఆమోదించిన గేటెడ్ కమ్యూనిటీ నిబంధనలకు విరుద్ధంగా, తెల్లాపూర్ మున్సిపల్ అధికారుల అండదండలతో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతుందని పలుమార్లు హెచ్ఎండీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకున్న పాపానపోలేదని వాపోయారు. కాలనీకు చెందిన ఎస్టీపీ ప్లాంట్ నిర్వహణ పూర్తి బాధ్యత కాలనీ మెయింటెనెన్స్ కమిటీకి ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు ఐదు అంతస్తుల అపార్ట్‌మెంట్ డ్రైనేజీ కనెక్షన్‌ను కాల్వకు చెందిన ఆరు ఇంచుల పైపులైన్‌కు అనుసంధానం చేశారని తెలిపారు. దీని వల్ల రానున్న రోజుల్లో డ్రైనేజీ సమ స్య ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఎస్టీపీ ప్లాంట్‌ను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకుని వారే నిర్వహణ చూసుకోవాలన్నారు. అలాగే, అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి



పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరి కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవాణినగర్ కాలనీ సమీపంలో శనివారం ఓ వ్యక్తి పడి ఉండటంతో స్థానికులు 108 వాహనంలో పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే అమీన్‌పూర్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యం

పటాన్‌చెరు టౌన్: బస్టాండ్‌లో మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైనట్లు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ కాలనీకి చెందిన ఆనంద్ (45), ఈనెల 25న పనికి వెళ్తున్నానని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా, ఆదివారం వివిధ వార్తాపత్రికల్లో గుర్తు తెలియని వ్యక్తి బస్టాండ్‌లో మృతి చెందాడని రావడంతో కుటుంబ సభ్యులు పటాన్‌చెరు పోలీసులను సంప్రదించి, మృతదేహాన్ని పరిశీలించి మృతి చెందిన వ్యక్తి తన తండ్రిగా కుమారుడు గణేష్ గుర్తించాడు. మృతుడి కుమారుడు గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వట్‌పల్లి(అందోల్): అందోల్ పరిధిలోని కన్‌సాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011–12 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలను చూసి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. 13 ఏళ్ల తర్వాత వారంతా కలిసి ఉపాధ్యాయులు, మిత్రులను కలుసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాడెం బీరప్ప, బి.క్రిష్ణ, డి.రవి, రియాజ్, వని క్రిష్ణ, చందు, భాస్కర్, ప్రమీల, పార్వతీ, రేఖ, సౌందర్య, శిల్ప, సంతోష్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారంలోని తాబేలు గుట్టపై శివుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి. ఆదివారం జిన్నారం, జంగంపేట, ఊట్ల గ్రామస్తులు పోలీసులకు ఫిర్యా దు చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసే లా విగ్రహ ధ్వంసానికి పాల్పడినవారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

కదిలిన గులాబీ దండు

వరంగల్‌లోని ఎల్కతుర్తి వద్ద నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఆయా గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించి కదిలారు. ప్రొఫెసర్ జయశంకర్, శ్రీకాంతాచారి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళుర్పించి సభకు బయలుదేరారు.



నారాయణఖేడ్: పార్టీ శ్రేణులతో తరలిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



కంగ్టి: బాన్సువాడ నుంచి బస్సులో తరలివెళ్లిన కార్యకర్తలు



పటాన్‌చెరు: ముత్తంగి నుంచి..



జహీరాబాద్ గెస్టు హౌస్ వద్ద జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



సదాశివపేట మండలం నుంచి..

గాలివాన బీభత్సం



నేలరాలిన మామిడి కాయలు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం వాసర్‌లో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డికు చెందిన మామిడి తోటలో కాయలు నేలరాలాయి. ప్రభుత్వం నుంచి పరిహారం అందించాలని బాధితుడు కోరారు.

ఘనంగా బీరప్పస్వామి ఉత్సవాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు



జాతరలో శివసత్తుల పూనకాలు

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని గినియర్ పల్లి గ్రామంలో బీరప్పస్వామి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జాతరలో మొదటి రోజు ఆదివారం స్వామివారికి బోనాలు సమర్పించారు. డప్పుల చప్పుళ్ల, శివసత్తులు పూనకాల మధ్య బోనాలతో మహిళలు ఆలయానికి చేరుకున్నారు. ఆలయ చుట్టూ ప్రదక్షిణ వేసి స్వామి వారికి బోనాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మహానైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మరో రెండు రోజులు జాతర కొనసాగుతున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

దేశద్రోహులపై కఠిన చర్యలు తీసుకోవాలి

బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్లకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బైండ్ల కుమార్

పటాన్‌చెరు: భారతదేశంలో ఉంటూ ఇతర దేశాలకు మద్దతు తెలిపే ద్రోహులపై కఠిన చర్యలు తీసుకోవాలని టెలికం బోర్డు మెంబర్, బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. మతోన్మాదులు కొంతమంది దేశంలో ఉంటూ పాకిస్తాన్ ఉగ్రవాదులకు వత్తాసు పలుకుతున్న వారిపై దేశద్రోహం కింద కేసులు పెట్టి, కఠినంగా శిక్షించాలన్నారు. కులమతాలకు అతీతంగా దేశరక్షణ కోసం కేంద్రానికి మద్దతు తెలపాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజు, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంగడి బాలరాజు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా శాంతి ర్యాలీ



కంగ్టి: తడ్కల్‌లో ర్యాలీ నిర్వహించిన ముస్లింలు



కల్హేర్(నారాయణఖేడ్): ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్య వైశ్య సంఘం నాయకులు



జిన్నారం (పటాన్‌చెరు): నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్ గ్రామంలో ఆదివారం ముస్లింలు శాంతిర్యాలీ నిర్వహించారు. కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు 27 మంది పర్యాటకులను క్రూరంగా చంపినందుకు నిరసనగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆదివారం రాత్రి గ్రామంలో ముస్లింలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కొవ్వొత్తుల ర్యాలీతో మృతులకు నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం ఉగ్రవాద దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు.

కల్హేర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ

కల్హేర్(నారాయణఖేడ్): పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన పౌరులకు సంతాపసూచకంగా కల్హేర్‌లో ఆదివారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఆత్మచైర్మన్ భాస్కర్‌సేట్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వీర్‌శెట్టి, నాయకులు చంద్రమోహన్, రమేష్‌సేట్, హన్మండ్లు సేట్ పాల్గొన్నారు.

ఖాజీపల్లిలో..

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని ఖాజీపల్లికి చెందిన ఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో శాంతిర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి గాంధీబొమ్మ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఉగ్రదాడిలో మృతి చెందిన అమరులకు నివాళులర్పించారు. ఫౌండేషన్ చైర్మన్ రమాకాంత్ మాట్లాడుతూ.. ఉగ్రవాదుల దాడి పిరికి చర్యగా వర్ణించారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నియంత్రించాలన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

రాయికోడ్(అందోల్): మండలంలోని పలు ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. అమావాస్యను పురస్కరించుకొని ప్రజలు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి దైవదర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రాయికోడ్ చౌరస్తా హన్‌మాన్ ఆలయంలో ప్రత్యేక పూజ లు నిర్వహించి అన్నదానం చేశారు.



రాయికోడ్: హనుమాన్ ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

బగలాముఖీ శక్తిపీఠంలో హరిద్వార్చన

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. బగలాముఖీ ఉపాసకుడు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహా మంత్ర హవనం, హరిద్వార్చన, విశేష పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కమలేశ్ తదితరులు ఉన్నారు.

హనుమాన్ ఆలయంలో ..

నర్సాపూర్: నర్సాపూర్‌లోని బస్టాండ్ హనుమాన్ ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం, అన్న ప్రసాదం అందజేశారు. ప్రతినెలా అమావాస్య రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు చెప్పారు.



శివ్వంపేట: పూజలు చేస్తున్న భక్తులు